
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 అక్టోబరు 2025
5
చిత్తూరు



ఒంటరి ఏనుగు హల్‌చల్

భయాందోళనలో ముసలిముడు రైతులు, ప్రజలు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం ముసలిముడువద్ద శుక్రవారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఇక్కడే కుంకి ఏనుగులు ఉండటంతో వాటిని గమనించిన ఒంటరి ఏనుగు ప్రహరీ గోడను బద్దలు చేసి హల్‌చల్ చేసింది. ఇది గమనించిన అటవీ అధికారులు దూరంగా తరిమివేశారు. అయితే చుట్టుపక్కల పంట పొలాలను ధ్వంసం చేశాయని రైతులు విచారం వ్యక్తం చేశారు. కుంకీ ఏనుగులను తెచ్చినా ఏమాత్రం ప్రయోజనం లేదని రైతులు విచారం వ్యక్తం చేశారు. అతి కష్టంతో అటవీ అధికారులు అరణ్యం వైపు తరలించారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.



శ్రీవారి మెట్టు చిరువ్యాపారులకు సంఘీభావం



విద్యుత్ హమాలీల వినతి

ట్రంపు సుంకాలతో జిల్లా రైతులు కుదేలు

- మామిడి రైతులను నట్టేట ముంచారు
- తిరుమల వేదికగా బిజెపి మతతత్వ రాజకీయం
- 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సదస్సులో వక్తలు



సిపిఎం సదస్సుకు హాజరైన శ్రేణులు, మేధావులు, రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంపు సుంకాలతో యావత్ భారతదేశం కుదేలవడమే కాకుండా, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులపై తీవ్ర ప్రభావం పడనుందని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఉద్ఘాటించారు. నిత్యం కరువుతో సతమతమయ్యే చిత్తూరు, తిరుపతి జిల్లాలో ప్రత్యామ్నాయంగా పాడిపరిశ్రమను ఎంచుకుని జీవిస్తున్నారని, అలాంటి రంగంపై దిగుబడి సుంకాలను భారత ప్రభుత్వం ఎత్తివేస్తే పాడిరైతులందరూ నష్టపోవాల్సి వస్తుందన్నారు. హెరిటేజ్, దొడ్లా, అమూల్, మదర్, సంఘం డెయిరీలకు ఏమీ కాదని, వారంతా అమెరికా ఉత్పత్తులు కొనుగోలు చేసి అమ్ముకుంటారని, నష్టపోయేది పాడి రైతులేనని అన్నారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్... ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సదస్సు తిరుపతి రామతులసి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బివి రాఘవులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం దిగుమతి సుంకాలను ఎత్తివేస్తే చికెన్ కాళ్లు మనకు దిగుమతి అవుతాయని, ఈ కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ పల్టీ కొట్టే ప్రమాదం ఉందన్నారు. అలానే సోయాబీన్స్, మొక్కజొన్న ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ట్రంపు సుంకాలను ప్రశ్నించమని మోడీని అడిగే దమ్ము ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెబుతూ మామిడి రైతులతో డబుల్ గేమ్ ఆడిందన్నారు. పరిశ్రమలు కిలోపై ఎనిమిది రూపాయలు ఇస్తుందని, ప్రభుత్వం నాలుగు రూపాయలు ఇస్తుందని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం, పరిశ్రమలు కిలోకు నాలుగైదు రూపాయలు ఇస్తున్నా కిమ్మనకుండా చేష్టలుడిగి చూస్తోందన్నారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడాన్ని సిపిఎం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నిప్పుపెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 600 పాఠశాలలను విలీనం చేశారని, 44 పాఠశాలలు తీవ్ర ప్రమాద ప్రాంతాల్లో రైల్వేగేటు, జాతీయ రహదారులు దాటాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసి కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ అవినీతిలోనూ, అక్రమాలలోనూ, ప్రజా వ్యతిరేక విధానాల్లోనూ ఏమీ తేడా లేదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో ఉన్న నాలుగు పార్టీలు బిజెపికే ఓటేశాయన్నారు. 13 గంటల పని విధానాన్ని శాసనమండలిలో చట్టం చేస్తే వైసిపి వ్యతిరేక ఓటు వేసి ఉంటే బిల్లు పాస్ అయ్యేది కాదన్నారు. తిరుమలలో ఏడుకొండల స్వామి రోజురోజుకూ సామాన్యులకు దూరమవుతున్నారన్నారు. తిరుమల వేదిక చేసుకుని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ రాజకీయాలకు తెరలేపుతున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని, దీర్ఘకాలికంగా పోరాటాలు చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సదస్సులో వేదికపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.పుల్లయ్య, డి.జనార్ధన్, టి.సుబ్రమణ్యం, జిల్లా నాయకులు పి.సాయిలక్ష్మి, ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, రవిభగత్, హరినాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల గోడు టిటిడి పట్టించుకోవాలి : బివి రాఘవులు

సామాన్యుల గోడును టిటిడి పట్టించుకోవాలని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు గత 408 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. చిరువ్యాపారుల పట్ల కనీసం దయ, దాక్షిణ్యం లేకుండా ప్రవర్తించడాన్ని ఎవరూ హర్షించరని అన్నారు. బిఆర్ నాయుడు లాంటి మీడియా ప్రముఖులు, అనీల్‌కుమార్ సింఘాల్ లాంటి ఉన్నతాధికారి ఉన్నచోట పేదలు 408 రోజులుగా నిరసన దీక్షలు సాగించడం సమంజసం కాదన్నారు. దీక్షల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, యూనియన్ నాయకులు మధు, చిట్టిబాబు, చిరంజీవి, గణేష్, యుగంధర్, రాంబాబు, మల్లికార్జున్, ప్రకాష్, శేఖర్ లతోపాటు పలువురు వ్యాపారులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు.

బివి రాఘవులును సత్కరించిన కెవి చౌదరి



తిరుపతిలో పార్టీ కార్యక్రమానికి హాజరైన సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులును ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి సత్కరించారు. ఓ ప్రైవేట్ హోటల్లో బస చేసిన కె.వి చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కె.వి చౌదరిని రాఘవులు అభినందించారు. వ్యాపారుల సమస్యలు పరిష్కరించడంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా నాయకులు కందారపు మురళి ఉన్నారు.

విద్యుత్ హమాలీల వినతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతికి విచ్చేసిన సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులకు ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ హమాలీలు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు స్టోర్ హమాలీలుగా గత 40 సంవత్సరాలుగా తమ యవ్వన దశలో నుంచి 50 సంవత్సరాల వయసు వస్తున్నా నేటికీ కుటుంబ పోషణ కోసం సంస్థ ను నమ్ముకొని, ఎప్పుడో ఒకప్పుడు సంస్థలో విలీనం అవుతాం అని నమ్మి పనిచేస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి గత 11 రోజులుగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని తెలిపారు. అదే దారిలో వెళుతూ వస్తున్నటువంటి అధికారులు తమ కష్టాన్ని గుర్తించక, సమస్యను పరిష్కరించకపోగా అన్యాయమైన ధోరణిలో వ్యవహరిస్తున్నారు. తమ కష్టాన్ని గుర్తించి తమకు 46 వేల రూపాయలు జీతాన్ని అమలయ్యేటట్టు చూడాలని. అదేవిధంగా అధికార పార్టీ ఎమ్మెల్యేల అండ చూసుకొని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కాంట్రాక్ట్ లను కట్టబెట్టే విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వాలను తమ తరపున నిలదీసి తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆరోగ్య దాస్, కుమార్, చిరంజీవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నిప్పు



- భగ్గుమన్న అఖిలపక్ష, దళితసంఘాలు
- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు

ప్రజాశక్తి - వెదురుకుప్పం

మహాత్ముడు, జాతిపిత గాంధీ జయంతి మరుసటిరోజు తెల్లవారుజామున అంబేద్కర్ విగ్రహానికి దురహంకారులు నిప్పుపెట్టి చిచ్చు రేపారు.. ఈ ఘటన చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలో జరిగింది. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కొంతవరకూ అంబేద్కర్ విగ్రహం కాలిపోయింది. దీంతో దళిత, అఖిలపక్ష నాయకులు భగ్గుమన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీలు రగడకు దిగాయి. ఇటు ఎంఎల్ఎ థామస్ అనుచరులు, అటు వైసిపి నేత కృపాలక్ష్మి అనుచరులు పోటాపోటీగా ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు దేవళంపేటకు చేరుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎస్‌పి తుషార్ డూడీ ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనకారులకు సర్దిచెప్పారు. శుక్రవారం ఉదయం నుంచి దేవళంపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై జీడీ నెల్లూరు ఎంఎల్ఎ ఎంవి థామస్ స్పందిస్తూ దోషులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అసలేం జరిగింది..

దేవళంపేట మండలం ఓ చిన్నపాటి వాణిజ్య సముదాయం. ఇది బొమ్మయ్యపల్లి పంచాయతీ పరిధిలో ఉంది. గతంలో రోడ్డుకు ఆనుకుని పార్టీలకు అతీతంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం పక్కనే గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పార్టీ శ్రేణులు ఏర్పాటు చేశారు. అయితే గురువారం తెల్లవారుజామున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయం కావడంతో దుండగులను గుర్తించలేని పరిస్థితి అని తెలిపారు. విగ్రహం కాలుతూ ఉండడంతో స్థానికులు, ఆయా పార్టీల నాయకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అఖిలపక్ష నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనను ఖండించారు. దీంతో చిత్తూరు జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అనుమానం ఉన్న కొంతమందిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాలిన విగ్రహానికి అఖిలపక్షం నాయకులు గుడ్డతో కప్పేశారు.

దోషులను వెంటనే అరెస్టు చేయాలి : వైసిపి, దళితసంఘాలు

దోషులను వెంటనే అరెస్టు చేయాలని జీడీనెల్లూరు వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. సర్పంచి చొక్కా గోవిందయ్య మాట్లాడుతూ విగ్రహ వినాశనానికి సతీష్‌నాయుడు అతని అనుచరులు పయని, తేజ, బుజ్జి, ఉమాపతిలని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితులందరూ స్థానికుల సహకారంతో ఐక్యంగా బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీర్ణించుకోలేని టిడిపికి చెందిన సతీష్ నాయుడు సంతగేటుకు అడ్డుగా ఉందని, విగ్రహాన్ని తొలగించాలని పలుమార్లు ప్రయత్నించా రన్నారు. స్థానికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారన్నారు. ఎలాగైనా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తానని గతంలో సతీష్‌నాయుడు సవాల్ విసిరారని గుర్తు చేశారు. గురువారం అర్ధరాత్రి సతీష్‌నాయుడు అనుచరులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్‌పోసి నిప్పుపెట్టారని ఆరోపించారు. ఈ ధర్నాలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి పాల్గొన్నారు.





వైసిపి, టిడిపిల ఖండనలు

నిందితులను అరెస్టు చేయాలని ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా దోషులను వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎం రవి ఆధ్వర్యంలో వెదురుకుప్పం ఎస్ఐకు విన్నవించారు. దోషులను శిక్షించాలని టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యదర్శి నేషనూరు మునిచంద్రారెడ్డి కోరారు.

దోషులను వదిలిపెట్టేది లేదు
ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్

దోషులను ఎటువంటి పరిస్థితిలోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం చాలా హేయమైన, నీచమైన చర్య. ఇలాంటి ఘటనలు బాధాకరం. ఈ ఘటనపై చిత్తూరు జిల్లా ఎస్పీ, డిఎస్‌పితో మాట్లాడాం. కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ఘటనకు పాల్పడిన వారు వెరైనా ఎటువంటి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు.

అంబేద్కర్ అంటే ఎందుకంత కక్ష
పోటుగారి భాస్కర్, కాంగ్రెస్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటే కొన్ని వర్గాల వారికి ఎందుకు అంత కక్ష అని కాంగ్రెస్ నాయకులు పోటుగారి భాస్కర్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ధికారంలోకి వచ్చిన తరువాత ఇటు టిడిపి, జనసేన నాయకులు కేంద్రంలో సాక్షాత్తు హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను హేళనగా మాట్లాడుతుంటే మౌనంగా కూర్చుండిపోయారన్నారు.

దారుణ సంఘటన : మురళీకృష్ణ, పూతలపట్టు ఎంఎల్ఎ

దేవళంపేట ఘటన దారుణమని పూతలపట్టు ఎంఎల్ఎ మురళీకృష్ణ ఖండించారు. శుక్రవారం ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న , స్థానిక ఎమ్మెల్యే తామస్ , జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో. కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టి ధ్వంసం చేశారని, ఇది అమానుషమైన ఘటన అని అన్నారు.దుండగులను గుర్తించి త్వరలోనే చట్టం ముందు నిలబెడతామని, సమాజంలోనూ మార్పు రావాలన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఈ ఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాంబేడు నీటిపారుదల సంఘం అధ్యక్షులు బోడిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఘటనకు పాల్పడిన వారు ఎంతటివారైనా నిక్పక్షపాతంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ ఘటన సమాజానికి సిగ్గుచేటన్నారు.దళితుల బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తులసిమణి, వెదురుకుప్పం మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సువ్వాల జగదీష్‌రెడ్డి ఖండించారు.

చిత్తూరు జిల్లాలో నిరసనలు

పలమనేరు అంబేద్కర్ సర్కిల్లో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, బిఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రాజు, బిఎస్‌పి జిల్లా నాయకులు శివాజీ గోవిందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో, కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో అంబేద్కర్ విగ్రహాలు లేకుండా చూడాలని చూస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహాలను చూసి నరేంద్రమోడీ, అమిత్‌షాలా చంద్రబాబు కూడా భయపడుతున్నారన్నారు. వీరందరికీ అంబేద్కర్ ఫోబియో పట్టుకుందన్నారు. ఇలాంటి చర్యలను మానుకోని పక్షంలో ఈ ప్రభుత్వాన్ని కూల్చే ప్రమాదాన్ని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద బందోబస్తు ఉంచాలన్నారు. పుంగనూరులో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఆర్ అశోక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



దుండగులను కఠినంగా శిక్షించాలి
వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన బిజెపి హయాంలో నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులను అరెస్టు చేయాలి. ఈ మేరకు చిత్తూరు అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సత్వర స్పందన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: చిత్తూరు జిల్లా, వెదురు కుప్పం మండలంలోని దేవళంపేట గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేసిన ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఫిర్యాదు చేసిన రెండు గంటలలోపే కమిషన్ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు 30 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించమని ఆదేశిస్తూ, నివేదికలో ఎఫ్.ఐ.ఆర్ వివరాలు, నమోదు చేసిన సెక్షన్లు, అరెస్టులు, చార్జ్ షీట్ స్థితి తదితర సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట గడువులో నివేదిక అందించనట్లయితే, భారత రాజ్యాంగం ఆర్టికల్ 338 ప్రకారం సివిల్ కోర్ట్ అధికారాలను వినియోగించి, సంబంధిత అధికారులను వ్యక్తిగతంగా లేదా ప్రతినిధి ద్వారా కమిషన్ ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేయనున్నట్లు హెచ్చరించింది. షెడ్యూల్డ్ కులాల భద్రత, గౌరవం కాపాడటంలో కమిషన్ కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం ప్రతీకలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు.

నేడు 'వాహన మిత్ర' ప్రారంభం

6,777 లబ్ధిదార్లకు రూ.10,16,55,000 పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నేడు వాహన మిత్ర పథకంను ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేసి ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రారంభించనుంది. జిల్లాలో ఆటో మిత్ర పథకం ద్వారా జిల్లాలోని 6,777 మంది ఆటో డ్రైవర్లకు రూ. 10 కోట్లు , 16 లక్షల రూపాయులు పంపిణీ చేయనున్నారు. పండుగ వాతావారణంలో వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధిదార్ల పంపిణీ కార్యాక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రం ఏర్పాటు చేస్తోంది. ఈ సభలో ప్రోటోకాల్ మేరకు స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదార్లకు నియోజవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పంపిణీ చేయనున్నారు.

వాహన మిత్ర ద్వారా చిత్తూరు నియోజకవర్గంలో 1,402 మందికి రూ. 2,10,30,000లు లబ్ధి, పూతలపట్టు నియోజకవర్గంలో 1,074 మందికి 1,61,10,000 రూపాయలు లబ్ధి, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 936 మందికి 1,40,40,000 రూపాయలు లబ్ధి, నగరి నియోజకవర్గంలో 293 మందికి 43,95,000 రూపాయలు లబ్ధి, పలమనేరు నియోజక వర్గంలో 1,028 మందికి 1,54,20,000 రూపాయలు లబ్ధి, కుప్పం నియోజకవర్గంలో 574 మందికి 86,10,000 రూపాయలు లబ్ధి, పుంగనూరు నియోజకవర్గంలో 1470 మందికి 2,20,50,000 రూపాయలు ఆటో డ్రైవర్లకు అందజేయనున్నారు.

నిండిన చెరువులు- రైతుల హర్షం

- చెరువు కట్టకు పగుళ్లు
- రైతుల ఆందోళన



చెరువులో నిండిని నీళ్లు.. కట్టకు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన హంద్రీ-నీవా కాలువ ద్వారా ప్రవహించిన నీరు కామినాయనపల్లి చెరువుకు చేరింది. చెరువు నిండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తుం డగా, అదే సమయంలో బైరెడ్డిపల్లి-పుంగనూరు జాతీయ రహదారి వద్ద చెరువు కట్ట మధ్యలో పగుళ్లు రావడంతో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం కట్ట కింద నుంచి నీరు ప్రవహిస్తుండటంతో కట్ట దిగువన పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల తహశీల్దారు ఎంపీడీవోకి చరవాణి ద్వారా తెలుపగా వారు వెంటనే స్పందించి మండల తహశీల్దారు ప్రసన్నకుమార్ ఈ విష యా న్ని గమనించి, ఇరిగేషన్ సిబ్బందికి కట్ట, మొరవ కాలువ మరమ్మతులు చేయాలని గురువారం ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అయితే, ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రైతులు, స్థానికులు అధికారులను కోరుతూ చెరువు కట్టకు తక్షణమే మరమ్మ తులు చేయాలన్నారు. నిర్లక్ష్యం వల్ల పంటలు, ప్రజల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

7న చంద్రబాబు రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 7న నారావారిపల్లెకు రానున్నారు. నారా చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు '11వ నెల విస్తరి' కార్యక్రమం ఈనెల ఏడో తేదీ నారావారిపల్లిలో జరగనుందని చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని తెలిపారు. కుటుంబసమేతంగా చంద్ర బాబు రానున్న నేపథ్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి, జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్‌పిలు భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఎ.రంగం పేట హైస్కూలు వెనుక భాగంలో హెలిపాడ్‌ను పరిశీలించారు.

బాలికపై అత్యాచారం కేసులో ముగ్గురు అరెస్టు



అత్యాచార నిందితులను కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఒంటరి అమ్మాయిలు, ప్రేమ జంటలే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతూ గత నెల 25వ తేది మురకంబట్టు నగర వనం (ఫారెస్టుపార్కు)లో పట్టపగలే ఓ ప్రేమ జంట రహస్య వీడియోలు చిత్రీకరించి ప్రేమికుడిని బందించి బాలికపై సామూహిక అత్యాచారం చేసిన ఘటనలో నాటకీయ పరిణామాల మధ్య ఎట్టకేలకు పోలీసులు నిందితుల అరెస్టును శుక్రవారం వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పుననావృతం కాకుండా నిందితులకు సిగ్గుపడేలా ముఖానికి మాస్కులు లేకుండా స్థానిక జిల్లా ఎస్పీ పాత కార్యాలయం నుండి జిల్లా కోర్టు వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లి రిమాండ్‌కు తరలించారు. బాధిత బాలిక, ఆమె స్నేహితుడు ఫిర్యాదు మేరకు పార్కులో ఉన్న తమను ముగ్గురు యువకులు వీడియోలు చిత్రీకరించి తమను బెదిరించడంతో పాటు తనతో ఉన్న స్నేహితున్ని బందించి తనపై ముగ్గురు అత్యాచారం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఈనెల గత నెల 29వ తేది చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు, సెక్షన్స్ యుభార్ఎస్ 70 (2), 109 (1);309 (4), 118 (1), 115 (2), 351 (3), ఆర్ భార్ డబ్ల్యూ 3 (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాలికపై అత్యాచార ఘటన వెలుగులోకి రావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు 'నిందితులు మీ పార్టీ వారంటే మీ పార్టీ వారు' అంటూ ఆరోపణలు గుప్పించారు. దీంతో ఈ కేసుకు ఘటన రాజకీయ రంగు పులుముకుంది.

బాలికపై అత్యాచార ఘటనలో నిందితులుగా మురకంబట్టుకు చెందిన మహేష్, కిషోర్‌తో పాటు సంతపేటకు చెందిన హేమంత్‌గా గుర్తించిన పోలీసులు శుక్రవారం చిత్తూరు నగరంలోని చెన్నమ్మగుడిపల్లి రహదారి వద్ద వాకర్స్ అసోషియేషన్ నిర్మించిన యోగా సెంటర్ వద్ద అదుపులోకి తీసు కున్నారు. బాలికపై అత్యాచార ఘటనలో ఏ -1 నిందితుడిగా ఉన్న మహేష్ 2019లో చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక ఈవ్‌టిజింగ్ కేసులులో నిందితుడిగా ఉన్నాడు. ఏ-2 2022లో నగరంలోని ఓ వైన్‌షాపులో పనిచేస్తూ అక్కడి మద్యం బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు కేసు నమోదై వుంది. చిత్తూరు నగర సమీపంలోని మురకంబట్టు నగర వనం పార్కులో చోటు చేసుకున్న బాలికపై అత్యాచార ఘటన గత నెల 25వ తేదీ చోటు చేసుకోగా 29వ తేదీ తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అక్టోబర్ 3వ తేది నిందితులను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా చిత్తూరు పోలీసులు స్థానిక పాత జిల్లా ఎస్‌పి కార్యాలయం నుండి చిత్తూరు -వేలూరు జాతీయ రహదారిపై నిందితులు సిగ్గుపడేలా ముఖానికి మాస్కులు లేకుండా రోడ్డుపై ఊరేగిస్తూ జిల్లా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు.

కుప్పం డివిజన్‌లో 30 పోలీస్ యాక్టు: డిఎస్‌పి

ప్రజాశక్తి -కుప్పం:

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కుప్పం డివిజన్ పరిధిలో అక్టోబర్ 31 వరకు 30 పోలీస్ యాక్టును అమలు చేస్తునట్లు డిఎస్పీ పార్థసారథి తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు పోలీస్ స్టేషన్లో పరిధిలో 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఏవైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతరత్రా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరి ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

జిల్లాకు ఆరు అవార్డులు



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని, యువతలో పారిశుద్ధ్యంపై అవగాహన పెరగాలన్నారు. గురువారం జిల్లా సచివాలయంలో అక్టోబర్ 2 న మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం లో భాగంగా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి కార్యక్రమాలు పురస్కరించుకుని ఇందులో భాగంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో స్వచ్ఛతాహీ సేవ లో భాగంగా పారిశుద్ధ్యం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛతాహీ సేవా సందర్భంగా ఈ నెల 6వ తేదీ అవార్డుల ప్రదానం చేస్తారన్నారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రదివస్‌ను ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించడంలో ఈ అవార్డులు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

అవార్డులు ఇలా

స్వచ్ఛ మున్సిపాలిటీ లలో పలమనేరు మున్సిపాలిటీ, కుప్పం మున్సిపాలిటీ ఉత్తమ గ్రామ పంచాయతీ శాంతిపురం మండలంలోని, కను మాకులపల్లె. స్వచ్ఛ అంగన్వాడి కేంద్రం కమ్మ నాయన పల్లి . స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు కడ కార్యాలయం కుప్పం స్వచ్ఛ బస్ స్టేషన్ చిత్తూరు. జిల్లా స్థాయి అవార్డులు పుంగనూరు మున్సిపాలిటీ ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ, ఇరికిపెంట (సోమల మండలం), ఆగర మంగళం (గంగాధర నెల్లూరు మండలం), బందార్లపల్లి(రామకుప్పం మండలం), మహాసముద్రం(బంగారుపాలెం మండలం) గ్రామాలకు ఉత్తమ స్వచ్ఛ అంగన్వాడిలుగా, జిల్లా పరిషత్ కార్యాలయం చిత్తూరు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఉత్తమ స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలుగా అవార్డులు లభించాయి.

గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గ్రామాల అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేశారని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని అనాడే గ్రహించి గాంధీజీ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. గాంధీజీ ఆశయాల మేరకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి స్వచ్ఛాంధ్ర ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : మహాత్మా గాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం కూడలిలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత పూలమాలలేసి ఘన నివాళులు అర్పించారు.

సుందరీకరణ పనులు చేపట్టాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు రైల్వే పైవంతెన కింది భాగంలోని రహదారులను సుందరీకరణ చెపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక నేతల వినతి మేరకు కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రైల్వే వంతెన కింద రోడ్డును పరిశీలించారు. విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్న ఈ రోడ్డు, వంతెన కింది భాగాలను రెండు వైపులా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, బిజెపి నాయకులు జగదీశ్వర్ నాయుడు , వెంకటేశ్వర చౌదరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ చెక్ పోస్ట్ తనిఖీ

ప్రజాశక్తి-శాంతిపురం: కుప్పం -పలమనేరు జాతీయ రహదారిలోని శాంతిపురం మండలం మఠం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ ను కుప్పం ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు శుక్రవారం తనిఖీ చేశారు. జాతీయ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా విధులు నిర్వహించాలని చెక్ పోస్ట్ సిబ్బందికి సూచించారు.

పాయలగుట్ట ఎస్టీ కాలనీ సందర్శన

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట ఎస్టీ కాలనీ ని కలెక్టర్ ఇటీవల సందర్శించి గ్రామంలోని 14 కుటుంబాల వారు సరైన ఇంటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతూ ఉండడంతో ఒక్కో కుటుంబానికి ఒక లక్ష 50 వేల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రహ్మణ్యం సోమల హౌసింగ్ ఏఈ మణికంఠ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాయలగుట్ట ను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుతం ప్రజలు నివాసం ఉంటున్న ఇండ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించేందుకు కలెక్టర్ ఒక్కో ఇంటికి ఒక లక్ష యాభై వేల రూపాయల నిధులు మంజూరు చేశారని వాటిలో మొదటి విడతగా 75 వేల రూపాయలు లబ్ధిదారుల ఖాతాకు వేసేందుకు ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, ఇప్పుడు ఉన్న ఇండ్ల పై కప్పు బండలతో కలిగి ఉన్నాయని వాటిని తొలగించి మోల్డింగ్ వేసుకోవాలని తెలిపారు. అనంతరం భారత మిట్ట లో హౌసింగ్ నిర్మాణాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సోమల లోని సిమెంట్ గోడౌన్ తనిఖీ చేశారు.

పలమనేరు పరిరక్షణ సమితి కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో విజయదశమి సందర్భంగా పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక ఎన్జీఓ హోం పిపిఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎన్జీజీఓ సంఘం అధ్యక్షు లు, పిపిఎస్ గౌరవాధ్యక్షులు కె. ఆనందబాబు అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన టిఎల్ నరసింహులు, ప్రధాన కార్యదర్శి వి నారాయణ మాట్లాడుతూ పలమనేరు ప్రజల శ్రేయస్సు దృష్ట్యా సమితి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తామన్నారు. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ హైవే కనెక్టివిటీని పలమనేరుకు తీసుకురావడం, బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు కోసం త్వరలో ఎమ్మెల్యే, పార్లమెంట్ సభ్యులను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీజీఓ కార్యదర్శి జయమ్మ, తులసినాధం నాయుడు, ఆకుల గజేంద్ర, డి.సి.సి మాజీ అధ్యక్షులు సుధాకర్, బాస్ అధ్యక్షులు రూపేష్, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజీ, జిల్లేడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్‌టీపై విస్తృత అవగాహన కల్పించాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ తగ్గింపు అనే నినాదంతో ర్యాలీని కలెక్టరేట్ ఆవరణ నుండి జెసి విద్యాధరి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధాల రంగాల రైతులకు యంత్రాలపై జీఎస్టీ12 శాతం నుండి5 శాతం తగ్గించడం వల్ల వారి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ ర్యాలీ కొత్త కలెక్టరేట్ నుండి సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ అనే వినాదంతో గిరింపేటలోనిపాత కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి విద్యాధరి

ప్రజలకు అందుబాటులో ఎన్‌సిడి వైద్యం

జిల్లా వైద్యాధికారి సుధారాణి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రజలకు అందుబాటులో ఎన్‌సిడి వైద్యం వుంటుందని జిల్లా వైద్య అధికారి సుధారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నూతనంగా ఎన్‌సిడి క్లినిక్ ప్రారంభించేందుకు శుక్రవారం వసతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య నిమిత్తం దీర్ఘకాలిక వ్యాధులకు రక్త పోటు, మధుమేహం, గుండె వ్యాధులు, కేన్సర్లు, తదితర వాటికి సులభతర ఉచిత చికిత్స అందించేందుకు నూతనంగా ఎన్‌సిడి క్లినిక్స్ ప్రారంభిస్తోందని ఈ క్లినిక్స్ ద్వారా ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యంపై అవగాహన కల్పించాలని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. టేకుమంద ఉన్న 104 వెహికల్ ను ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్‌వో డాక్టర్ ప్రవీణ, ప్రధాన వైద్యాధికారి శిరీష, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి సుధారాణి

గ్రామస్తుల స్ఫూర్తి మరవలేనిది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బంగారుపాలెం: గ్రామస్తుల స్ఫూర్తి అభినందనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. మండలంలోని కాటప్పగారి పల్లి గ్రామంలో సివిఎం పవర్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన హరి, తులసిరాంలు తమ పుట్టిన ఊరిలో సుమారు 50మందికి ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో పరిశ్రమను స్థాపించగా, విజయదశమి సందర్భంగా ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. సొంత గ్రామంలో ఫ్యాక్టరీని స్థాపించి స్థానికులకు ఉపాధి కల్పించాలనే మంచి ఆలోచనతో ఫ్యాక్టరీని స్థాపించిన హరి, తులసీ రాంలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం పరిశీలకులు ఎన్.పి.జయప్రకాశ్ నాయుడు, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణీ నాయుడు, మాజీ బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఎన్‌పిజయచంద్ర నాయుడు, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణదారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని మున్సిపల్ సిబ్బంది హెచ్చరించారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వచ్ఛ కుప్పం- స్వర్ణ కుప్పం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలంటూ కమిషనర్ పిలుపునిచ్చారు.

క్రైం న్యూస్

రెండు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మండలంలోని ముడిపల్లె గ్రామంలో రెండిళ్లలో బుధవారం రాత్రి చోరీ చోటు చేసుకుంది. గురువారం ఉదయం చోరీ విషయాన్ని గ్రామస్తులు తెలుసుకున్నారు. ముడిపల్లె గ్రామానికి చెందిన నాగరాజ స్వామి బుధవారం బొమ్మల కొలువు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఇల్లు తాళం వేసి పక్కనే ఉన్న మరో నివాసంలో రాత్రి బస చేశారు. ఉదయం నివాసానికి వెళ్లి చూడగా ఇంటి తలుపుల గొళ్లెంను పగలగొట్టి ఉండటం ఇంటిలో ఉంచిన రూ.30 వేలు నగదు, బొమ్మల కొలువులో అమ్మవారికి వేసిన రెండు సవరాల బంగారు గొలుసు చోరీ చేసి ఉండటం గమనించారు. ఆ నివాసానికి పక్కనే ఉన్న మరో నివాసంలో వుంటున్న నాగరాజు అనే ఉద్యోగి ఉద్యోగరీత్యా నగరి పట్టణంలో నివాసం ఉంటున్నారు. తన నివాసం పక్కనే ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంగతి తెలుసుకొని తన నివాసం వద్దకు వెళ్లి చూడగా ఆయన ఇంటి గడి కూడా తొలగించి వుంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి వున్నాయి. పూజగదిలో ఉంచిన ఒక సవరం బంగారు నగలు చోరీకి గురైంది. హుండీని పగలగొట్టి అందులోని నోట్లను మాత్రం తీసుకెళ్లి ఉండటం గమనించారు. బాధితులు చోరీ సంగతిని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితులకు 17 వరకు రిమాండు

జిల్లా జైలుకు తరలింపు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బాలిక అత్యాచార కేసులో నిందితులు మహేష్, హేమత్ ప్రసాద్, కిషోర్‌లను చిత్తూరు జిల్లా పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. నిందితులకు నాల్గవ అదనపు కోర్టు న్యాయమూర్తి షెక్ బాబాజాన్ ఈనెల 17వ తేది వరకు రిమాండ్ విధించారు. నిందితులను జిల్లా జైల్‌కు తరలించారు.

దొంగతనం కేసు ఛేదింపు

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరులో చోటుచేసుకున్న దొంగతనం కేసులో ఐదుగురిని అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల సెప్టెంబర్ 26 వ తేది మధ్యాహ్నం పలమనేరు టౌన్ మండలం గడ్డూరులోకు చెందిన మోహనకుమారి ఇంట్లో దొంగతనం కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పలమనేరు రోడ్డులోని గంటావూరు ఫ్లైఓవర్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 68.690 గ్రాముల బంగారు నగలను, ఒక రోల్డ్ గోల్డ్ నక్లెస్, ఒక జత రోడ్ల్ గోల్డ్ కమ్మలు, 90 వేల రూపాయల నగదును, ఒక పల్సర్ మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలిస్తామని తెలిపారు.

పలమనేరు మున్సిపాల్టీకి 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డు

ప్రజాశక్తి-పలమనేరు: 'స్వచ్ఛ ఆంధ్ర - 2025' అవార్డుకు పలమనేరు మున్సిపాల్టీ ఎంపికైంది. మొత్తం 21 క్యాటగిరిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. రాష్ట్ర స్థాయిలో 69, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులు ఇవ్వనుంది. ఇందులో రాష్ట్ర స్థాయిలో ఆరు మున్సిపాల్టీలు, ఆరు గ్రామ పంచాయతీలను ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో పలమనేరు మున్సిపాల్టీ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈనెల 6వ తేదీ విజయవాడలో స్వచ్ఛ మున్సిపాల్టీకి అవార్డును పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి అందుకోనున్నారు.

ఎన్‌ఎఫ్‌పిఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఎన్‌ఎఫ్‌పిఎస్ దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం తహశీల్దారు కార్యాలయంలో పలువురు ఎన్‌ఎఫ్‌పిఎస్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 -59 సంవత్సరాల లోపు గల వితంతువులకు ఈ స్కీమ్ అర్హత వుందన్నారు. 2017 ఏప్రిల్ 17వ తేదీ తర్వాత మృతి చెందిన వారికి కేంద్ర ప్రభుత్వం ఈ స్కీం ద్వారా 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందని స్కీం కావలసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ డెత్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఆదాయపు సర్టిఫికెట్లను జత చేసి తహశీల్దారు కార్యాలయంలో అందివ్వాలని పరిశీలించిన తర్వాత వారికి అర్హత ఉంటే మంజూరు చేస్తామన్నారు.

టిడిపి సీనియర్ నాయకునికి నివాళి



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రామకుప్పం : రామకుప్పానికి చెందిన టిడిపి సీనియర్ నేత ఆర్‌సిసుబ్బారెడ్డి (75) గత కొంత కాలంగా అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు పలువురు నాయకులు నివాళులర్పించారు. రైతు సంఘం అధ్యక్షుడుగా, తెలుగు రైతు నాయకుడిగా ఆ పార్టీ ఆవిర్భావం నుండి నిస్వార్థంగా తన సేవలు టిడిపికి అందించారని ఏపీ యస్‌ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు సుబ్బారెడ్డి సేవలు కొనియాడారు. ఆయన మృతి టిడిపి కి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితో పాటు టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, గుర్రప్ప, కృష్ణా రెడ్డి, సుబ్రీ, బాలు, అఖిలపక్ష నాయకులు సుబ్బారెడ్డి మృతికి నివాళులు అర్పించారు.

పీకేఎం ఉడా ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు కుప్పం మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఉడా) ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబును పలమనేరు టిడిపి నాయకులు సన్మానించారు. పీకేయం ఉడా ఛైర్మన్‌గా డాక్టర్ సురేష్ బాబు బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి పలమనేరు టీడీపీ కార్యాలయానికి వచ్చారు. స్థానిక నేతలు ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 6వ తేదీ కుప్పంలో నిర్వహించే తన ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆయన అందరినీ ఆహ్వానించారు. కుప్పంతో పాటు పలమనేరు అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, బ్రహ్మయ్య, ఖాజా పీర్, నాగరాజు, మదన్, శ్రీధర్, బీఆర్ కుమార్, మండల నాయకులు నాగరాజు రెడ్డి, పెద్దబ్బ, జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎంఈవో

ప్రజాశక్తి-తవణంపల్లి: పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్, మాజీ జెడ్పీటీసీ, మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరిని ఎంఈవో హేమలత కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిటైర్డ్ టీచర్ మునస్వామి, బాలచంద్రారెడ్డి, మధుబాబు, రాజేష్ కుమార్, పెద్దబ్బారెడ్డి, ఉమాపతిరెడ్డి, నరసింహారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి -సోమల: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు దృష్ట్యా రైతులకు వచ్చే లబ్ది గురించి మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ అవసరాల కోసం వాడే ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ యాంత్రీకరణ వస్తువులపై కేంద్ర ప్రభుత్వం భారీగా జీఎస్టీ తగ్గించిందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏ ఏ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందో కరపత్రాలను రైతులకు పంచిపెట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో పశువైద్యాధికారిణి చందన ప్రియ, రైతులు పాల్గొన్నారు.

సోమల: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ, పశు సంబంధిత వస్తువులపై జీఎస్టీని తగ్గించడంతో మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో రైతులు ప్రజలు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు మండల టిడిపి అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పిఏసిఎస్ ఛైర్మన్ శివశంకర్ వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ పశుసంవర్ధక శాఖ వైద్యాధికారిణి చందన ప్రియ రైతులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శివకుమార్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: తగ్గించిన జీఎస్టీ మేరకు వ్యాపారాలు సాగించాలని దుకాణదారులకు మండల స్థాయి అధికారులు గురువారం కరపత్రాలతో అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు వివరాలను గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శులు వివరించాలని ఆదేశించారు.

గంగాధర నెల్లూరు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ రైతులకు వరం లాంటిదని పెనుమూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడుకృష్ణమ నాయుడు, జీఎస్టి అధికారి సుమతి అన్నారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వ్యవసాయ, పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, సింగిల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ట్రాక్టర్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. ఆనందబాబు, తహశీల్దార్ ఎంఎస్ ప్రసన్నకుమార్, వ్యవసాయ అధికారి గీతాకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్, మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.

తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జి ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డి బాబు వ్యవసాయ అధికారి ప్రవీణ్ వ్యవసాయ అధికారులు సిబ్బంది, జీఎస్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : రాజంపేట పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని వారి స్వగృహంలో కార్వేటినగరం ఎంపీటీసీ ఆర్ లత బాలాజీ శుక్రవారం శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ పురందర్, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి గోపి సర్పంచులు ఆకుల గోపి, లోకనాదం నాయుడు,ఎంపీటీసీ మురగయ్య, ధనరాజు,మండల కో ఆప్షన్ సెంటర్ పట్టం ప్రభాకర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరెడ్డి,నాయకులు జేజేలు రెడ్డి, రాజారెడ్డి,మాజీ సర్పంచ్ మురగయ్య,రాజారాం యాదవ్ పాల్గొన్నారు.



ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన ఎంపీటీసీ లతాబాలాజీ

రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ధర్మపురి రెవెన్యూ పరిధిలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తం 441 మంది రైతులకు సంబంధించి 635 ఎకరాల భూములను రీ సర్వే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ధర్మపురి గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. మండల తహశీల్దార్ ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సర్వే ప్రక్రియ, పత్రాలు, భూముల వివరాలు, ఎకరాల సరిపోలుపు వంటి అంశాలపై మండల సర్వేయర్ పిఎస్ నరేష్ మాట్లాడుతూ "ప్రతి రైతు తన భూమి వద్దకు వచ్చి సర్వేలో పాల్గొనాలి, రికార్డులు చూపించి, తన భూమికి ఉన్న పట్టా వివరాలు , సర్వేలో వస్తున్న ఎకరాల వివరాలతో సరిపోవాలన్నారు? లేదా ఏదేని విషయం స్పష్టంగా తెలుసుకోవాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మెజిస్ట్రేట్ ప్రసన్నకుమార్, డిప్యూటీ తహశీల్దారు కిషోర్, ఆర్‌ఐ దామ, వీఆర్వో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి విజయ, పంచాయతీ సర్వేయర్ ప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని ఆత్మకూరు సచివాలయంలో మూడవ విడత రీ సర్వేపై రైతులకు తహశీల్దారు శ్రీనివాసులు అధ్యక్షతలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా సర్వే టీం భూముల సర్వే చేసే వివరాల నమోదు చేస్తున్నపుడు రైతులు హాజరై వారి వివరాలు తెలిపి సహకరించాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వేలో అన్ని వివరాలు తెలిపి సర్వే టీం సహకరించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు రహీ ఫాతిమా, కుమార్, సర్పంచ్ జయచంద్ర రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



కందూరులో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

సచివాలయాలలో గ్రామసభలు

ప్రజాశక్తి -సోమల: మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన గ్రామ సభలను పలు పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నిర్వహించి గ్రామస్తుల ద్వారా సలహాలు, సూచనలు అందుకున్నారు. కందూరు ఇరికిపెంట పొదలకు కంటపల్లె, నంజంపేట తదితర పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి మహాత్మ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, పంచాయతీల అభివృద్ధి గురించి ప్రజలకు తెలిపి వారి నుండి సలహాలు, సూచనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, మేనక, మణికుమార్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సచివాలయాన్ని ఎంపీడీవో జీవిఎస్ ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సమయ పాలన పాటించాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయిస్తూ పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ శ్వేత, ఫయాజ్ పాల్గొన్నారు.

లలిత కుమారికి సన్మానం

ప్రజాశక్తి - పూతలపట్టు: మాజీ ఎమ్మెల్యే లలిత కుమారిని పూతలపట్టు వైసిపి నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసి) మెంబర్‌గా నియమితులైన ఆమెను తన స్వగ్రామం బంగారుపాళ్యంలో ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు దోహదపడాలని పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందన్నారని మండల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దేవిక, సర్పంచ్ ఎంపిపి మని, వెంకటరమణ, జైపాల్, నాగరాజు , బాలాజీ, షణ్ముగం పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో జీవిఎస్ ప్రసాద్

నిందితులను కఠినంగా శిక్షించాలి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - సోమల: వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి నిప్పు పెట్టడంతో విగ్రహం పూర్తిగా దగ్ధమైంది. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే పోలీసులు గుర్తించి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సోమల మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమానాథం, ఎమ్ఎస్ మండల అధ్యక్షులు ప్రకాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం చాలా బాధాకరమని పోలీసులు 24 గంటల లోపు గుర్తించి అరెస్టు చేయాలని లేని పక్షంలో జిల్లా స్థాయిలో ఎంఆర్‌పిఎస్, ఇతర అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఆందోళనలు చేసి న్యాయం సాధించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విజయదశమి వేడుకల్లో మాజీ మంత్రి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మాజీ మంత్రి ఆర్కేరోజా నివాసంలో విజయదశమి వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలతో అమ్మవారిని అలంకరించి పూజలు చేసిన ఆమె విజయదశమి రోజు తొమ్మిది మంది చిన్నారులను నవదుర్గలుగా భావించి వారికి పాదపూజలు చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. వారికి విందు భోజనం పెట్టి వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలాలు సమర్పించారు. వివిధ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షులు దేవేష్ రెడ్డి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, మురుగ, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, దీప, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

కార్వేటినగరం : ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం పనుల్లో కమిషనర్

విజయపురం (నగరి): స్వచ్ఛతే గాంధీ మార్గమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం నంజంపేట పంచాయతీ స్థిరంగుల గుట్ట గ్రామంలో పాఠశాలకు నిలిచిపోయిన విద్యార్థులను గుర్తించేందుకు ఎంఈఓ విజయకుమారి ఇంటింటి సర్వేని చేపట్టారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని పాఠశాలకు ప్రతిరోజు హాజరుకావాలని తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలలకు పంపిస్తూ వారి అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులను కోరారు. అనంతరం పాఠశాలలకు నిలిచిపోయిన పిల్లలతో మాట్లాడి పాఠశాలకు రావాలని ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందిస్తామని వారిని ఒప్పించారు. ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను క్లస్టర్ హెచ్ఎం హేమ సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి డ్రాప్ అవుట్ పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, డేటా ఎంట్రీ ఆపరేటర్ అస్లాం, ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

నేడు కుప్పంలో శ్రీవారి కల్యాణోత్సవం

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మండలం పరమసముద్రం బేటరాయ స్వామి కొండపై శనివారం టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. శ్రీవారి కల్యాణోత్సవం కోసం టిటిడి తోపాటు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ, టిడిపి నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అయితే ఈసారి ఆంధ్ర తమిళనాడు కర్ణాటక ప్రాంతాలకు చెందిన సుమారు 40 వేల మంది భక్తులు శ్రీవారి కళ్యాణోత్సవంలో పాల్గొంటారని అంచనాతో భారీ ఏర్పాటు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుటుంబం పేరు మీద భారీ అన్నదానం నిర్వహించనున్నారు. శ్రీవారి కల్యాణోత్సవం తిలకించేం దుకు భక్తుల సౌకర్యం ఆర్టీసి కుప్పం డిపో నుండి పరమసముద్రం, బేటరాయ స్వామి కొండ వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది.

పేద విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం: మాజీ మంత్రి

ప్రజాశక్తి- పూతలపట్టు: పేద విద్యార్థుల అభివృద్ధే తన లక్ష్యమని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలోని మంగళ్ విద్యాలయ పాఠశాలలో గురువారం నిర్వహించిన 50వ శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ వార్షికోత్సవంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కలిగిన ఎంతో మంది పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో పాటూరి రాజగోపాల్ నాయుడు స్ఫూర్తితో డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘాన్ని స్థాపించారన్నారు. ఎంతోమంది దాతలను భాగస్వాములుగా చేసి, పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ఇంటర్, డిగ్రీ , బిటెక్, సిఏ మొదలైన కోర్సుల్లో ప్రతిభ చూపిన 250 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.50 లక్షల రూపాయలు ఉపకార వేతనాలను అందించి ఇటీవల తాను రాసిన స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణలో భాగంగా రెండు సంవత్సరాలలో రు.కోటి రూపాయలు ట్రస్టుకు ఇచ్చానన్నారు. అమర రాజా సంస్థల అధినేత రామచంద్ర నాయుడు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా 1968లో రూ. వెయ్యి పెట్టుబడితో ఈ ట్రస్ట్ ను స్థాపించగా నేడు రూ.10 కోట్లు దాటిందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడి ఈ సంస్థకు మరింత చేయూతనిస్తే మరి కొంతమందికి సాయం చేయవచ్చని సూచించారు. ఈ ట్రస్ట్‌కు విరాళాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ కృష్ణ దేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ అధ్యక్షురాలు డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడుతూ లబ్ధి పొందిన విద్యార్థులు అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టరు మేడసాని మోహన్, ప్రణీత్, మహదేవ నాయుడు, సతీష్ రాళ్ళపల్లి, బాలాజీ కిరణ్, ప్రణీత్ సుధీర్, డాక్టరు ప్రసాద్, సర్పంచ్ రాధాకృష్ణ నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి